# పశువ్యాధులకు టీకాలే రక్ష


పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్య సహాయకులు


దూడకు మందు తాపిస్తున్న పశువైద్య సిబ్బంది

- వర్షాకాలంలో పశువులకు ముప్పు
- రైతులు అప్రమత్తంగా ఉండాలి
- నివారణ చర్యలు తీసుకోవాలి

**కాణిపాకం:** వర్షాకాలంలో పశువులకు సీజనల్ వ్యాధుల బెడద అధికంగా ఉంటుంది. వీటిని రక్షించుకోవాలంటే పశువులకు ముందస్తుగా టీకాలు వేయించాల్సిన అవసరం ఉంది. సాధారణంగా వర్షాకాలం వస్తోందంటే పశువుల పెంపకందారుల్లో ఆందోళన, గుబులు పుడుతుంది. రైతులకు వరి సాగు చేయడానికి వర్షం అవసరమే గాని పాడి పరిశ్రమకు మాత్రం ప్రాణ సంకటం లాంటిది. ముఖ్యంగా ప్రస్తుతం వేసవి కాలంలో వానలు పడుతుండడంతో రైతులు వ్యాధులపై ఆందోళన చెందుతున్నారు. పూతలపట్టు, చిత్తూరు నియోజకవర్గాల్లో రైతులు వ్యవసాయ ఆధారిత పంటలతోపాటు పాడి పరిశ్రమలకు అధిక ప్రాధాన్యతను ఇస్తుంటారు. ఎంత కరువు వచ్చినా, ఎంత నష్టం వచ్చినా ఆ లోటును పాడి పరిశ్రమతో భర్తీ చేసుకుని జీవనం సాగిస్తుంటారు. ఇలాంటి ప్రధాన ఆధారమైన పశువుల పట్ల రైతులు ఈ వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలని పశు సంవర్ధక శాఖ వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఈ వర్షాకాలంలో పశువులకు గొంతువాపు, జబ్బవాపు, చిటుక వ్యాధులు సోకే ప్రమాదం ఉంటుంది. ఈ వ్యాధులు జూన్ నుంచి సెప్టెంబర్ వరకూ తొలకరి వర్షాల సమయంలో సంభవిస్తుంటాయి. ఈ వ్యాధి సోకిందంటే పశువుల్లో వ్యాధి నిరోధక శక్తి తగ్గినట్లుగా రైతులు భావించాలి. ఈ వ్యాధులతో పాల దిగుబడి తగ్గడంతో ఆదాయ మార్గాలు తగ్గిపోతాయి. దాంతో రైతులు వ్యవసాయంతోపాటు పాడి పరిశ్రమలోనూ నష్టాలను చవి చూడాల్సి వస్తుంది. పూతలపట్టు, చిత్తూరు నియోజకవర్గాల్లో ఆవులు 1,37,458, గేదెలు 225, గొర్రెలు36,253, మేకలు 38,860 వరకూ ఉంటాయి. ఈ నేపథ్యంలో పాడి రైతులకు అధికారులు కొన్ని సూచనలు చేస్తున్నారు. అవేంటో ఓ సారి తెలుసుకుందాం.

**గొంతు వాపు వ్యాధి**

వర్షాకాలంలో పశువులకు ప్రధానంగా వచ్చేది. గొంతువాపు వ్యాధి. ఇది పాశ్చరెల్లా మల్టోసిడా అనే సూక్ష్మజీవుల వల్ల వ్యాపిస్తుంది. దీనినే గురకవ్యాధి అంటారు. వర్షాకాలంలో గేదెలు, ఆవులు ముఖ్యంగా దూడల్లో ఎక్కువగా వ్యాపిస్తుంది. ఒక్కోసారి గొర్రెలు, మేకలు, పందుల్లోనూ కనిపిస్తుంది. ఇది అంటువ్యాధి కాబట్టి ఇతర పశువులకు వ్యాపిస్తుంటుంది. కలుషితమైన నీరు, మేతల వల్ల పశువులకు రోగ నిరోధక శక్తి తగ్గి వ్యాధులు సంక్రమిస్తుంటాయి. కంటి నుంచి నీరు, నోటి నుంచి నురగ కారుతూ గురక, శ్వాస పీల్చడం కష్టమవుతుంది. జ్వర తీవ్రత 106, 107 డిగ్రీల వరకూ ఉంటుంది. గొంతు కిందకు నీరు దిగి గొంతువాపు వస్తుంది. ఈ వ్యాధి వచ్చిన 24 గంటల్లో మరణం సంభవించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

**నివారణ చర్యలు**

వర్షాకాలం ముందు జూన్, జూలై నెలల్లో వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలి. వ్యాధి ఉన్న పశువుల దొడ్డిని, గదులను ఫినాయిల్, క్రిసాల్ క్రిమి సంహారక ద్రావకంతో పరిశుభ్రం చేయాలి. వ్యాధి లక్షణాలు కనిపించిన పశువును వెంటనే పశువుల మంద నుంచి వేరుచేయాలి. వ్యాధి సోకిన పశువులకు వ్యాధి తీవ్రతను బట్టి సల్ఫాడిమిన్, ఇంటాసెఫ్జు, ఎక్సెప్టై వంటి ఇంజక్షన్లు ఇవ్వాలి. తప్పనిసరిగా పశు వైద్యాధికారిని సంప్రదించాలి.

**గాలికుంటు వ్యాధి**

వైరస్ లేదా కలుషితమైన గాలి ద్వారా వస్తుంది. తల్లిపాల ద్వారా దూడలకు సోకే అవకాశం ఉంటుంది. ప్రతి ఏడాది వర్షాకాలంలో గేదె, ఎద్దు, ఆవులకు వచ్చే వ్యాధుల్లో గాలికుంటు వ్యాధి ఒకటి. గిట్టలు ఉన్న ప్రతి జీవికీ ఈ వ్యాధి వస్తుంది. వ్యాధి సోకిన సమయంలో పశువుకు 104 నుంచి 105 డిగ్రీల జ్వరం ఉంటుంది. నోటిలో, గిట్టల మధ్య పుండ్లు ఏర్పడి పశువుల నడవలేని స్థితికి చేరుకుంటాయి. వర్షాలు ఎక్కువగా ఉండి చలిపెడుతున్నప్పుడు ఈ వ్యాధి విజృంభిస్తుంటుంది. ఈ వ్యాధి సోకిన పశువులకు నోటి, గిట్టల మధ్య బొబ్బలు ఏర్పడతాయి. 3, 4 వారాల్లో బొబ్బలు పగిలి పుండ్లుగా ఏర్పడతాయి. నోటి చిగుళ్లపై పొక్కులు ఏర్పడడం వల్ల పశువులు మేత తీసుకోలేక నీరసించిపోతాయి. ప్రధానంగా వర్షాకాలంలో నేలలు చిత్తడిగా ఉండడంతో గాలి కుంటు వ్యాధులు వస్తుంటాయి. ఈ వ్యాధి వల్ల సూడి పశువులు నీరసించిపోవడం, పాడి పశువుల నుంచి పాలదిగుబడి తగ్గిపోతుంది.

**నివారణ చర్యలు**

ఈ వ్యాధి సోకిన పశువులను మంద నుంచి వేరు చేయాలి. నోటిలోని పుండ్లకు బోరిక్ పౌడర్, గ్లిసరిన్ కలిపి పూయాలి. గిట్టల మధ్య పుండ్లకు పర్మాంగనైట్ ద్రావణంతో శుభ్రం చేసి వేపనూనె రాయాలి. యాంటిబయోటిక్స్, పెయిన్ కిల్లర్స్ వాడితే ఉపశమనం కలుగుతుంది. బిస్ప్రేపెన్ 2.5, ఎన్రోరో ప్లాక్సిన్ 50 ఎం.ఎల్.సెఫ్ ట్రిక్సోన్ 3 గ్రాములు, మెలోనెక్స్ 30 ఎం.ఎల్. నియోవెట్ 50 ఎం.ఎల్ వాడితే పశువులు పూర్తి ఆరోగ్యంగా ఉంటాయి.

**జబ్బ వాపు**

ఈ వ్యాధి క్రిలాస్టిడియం చావై అనే బ్యాక్టీరియా ద్వారా పశువులకు సోకుతుంటుంది. ఈ వ్యాధి పశువులకు ప్రాణహాని కలిగించే తీవ్రమైన అంటువ్యాధి. తెల్ల పశువుల్లో, ఆరు నెలల నుంచి మూడేళ్ల లోపు వయసున్న పశువులకు ఈ వ్యాధి ఎక్కువగా సోకుతుంటుంది. ఈ వయసులో పశువుకు రోగ నిరోధక శక్తి చాలా తక్కువగా ఉంటుంది. మట్టి ద్వారా, కలుషితమైన మేత, నీటి ద్వారా పశువు శరీరంలోకి ప్రవేశించి వ్యాధి సంభవిస్తుంది. భుజం, తొడ ప్రాంతాల్లోని కండరాలను ఆశించి కుళ్లిపోయేలా చేస్తుంది. వాపుతో పశువులు కుంటుతాయి. వెనుక కాలు కాని ముందు కాలుగాని పైకి లేపి కుంటుతుంటాయి. దీని నివారణకు వ్యాక్సిన్ ఒక్కటే మార్గమని పశువైద్యులు చెబుతున్నారు.

## క్లుప్తంగా

### పది సప్లిమెంటరీ పరీక్షకు 36 మంది హాజరు

**బంగారుపాళెం:** మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 10వ తరగతి సప్లిమెంటరీ పరీక్షకు 36 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ లలిత, డిపార్టుమెంట్ అధికారి చంద్రిక తెలిపారు. మొదటి రోజు తెలుగు పరీక్షకు 78 మందికి గాను 36 మంది హాజరు కాగా 42 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు.

### వేరుశనగ విత్తన కాయల పంపిణీ ప్రారంభం

**చిత్తూరు రూరల్(కాణిపాకం):** చిత్తూరు మండలంలో గురువారం వేరుశనగ విత్తన కాయల పంపిణీ ప్రారంభమైంది. ఉదయం 7 గంటల నుంచే వ్యవసాయ శాఖ సిబ్బంది విత్తన పంపిణీని ప్రారంభించారు. దీంతో రైతులు క్యూకట్టారు. వేలిముద్ర సేకరణ ద్వారా రైతులకు కాయలను అందించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా పంపిణీ చేశారు. తొలి రోజు ఐదు ఆర్బీకేల ద్వారా 865 మంది రైతులకు గాను 1150 బ్యాగులు అందజేశామని మండల వ్యవసాయశాఖ అధికారి వేణు తెలిపారు.

### కిశోర బాలికలు శుభ్రత పాటించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య

**తవణంపల్లె:** కిశోర బాలికలు వ్యక్తిగత శుభ్రత పాటించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.లావణ్య తెలిపారు. ఆమె శుక్రవారం మండలంలోని అరగొండ అంగన్‌వాడీ కేంద్రంలో మాసోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య మాట్లాడుతూ రుతుక్రమం, ఆరోగ్యం, పరిశుభ్రతపై వివరించారు. ప్రోటీన్లు ఎక్కువగా ఉండే శాకాహార, మాంసాహారం ఏదైనా తినవచ్చని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

### ఇంటివద్దే మెరుగైన వైద్యం


గుడిపాల: వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ అనూష

**గుడిపాల:** ఇంటి వద్దకే మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు బొమ్మసముద్రం డాక్టర్ అనూష తెలిపారు. మండలంలోని రాసనపల్లె గ్రామంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వివిధ వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. అనంతరం ఇంటివద్ద మంచాన పడ్డ రోగుల వద్దకు వెళ్లి వారికి కావాల్సిన వైద్యసేవలను అందజేశారు. గర్భిణులు, బాలింతలకు వైద్యసేవలు అందించి పౌష్టికాహారం తీసుకోవాలని వారికి సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది శిరిషా, ఉమామహేశ్వరి, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

### భక్తి ప్రపత్తులతో రాహుకాల పూజలు


బోయకొండలో ప్రత్యేక పూజలందుకున్న అమ్మవారు

**చౌడేపల్లె:** బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం భక్తి ప్రపత్తులతో రాహుకాల అభిషేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయ అర్చకులు అమ్మవారి గర్భాలయాన్ని శుద్ధి చేశారు. ఆలయ ఆశీర్వాద మండపంలో అమ్మవారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. రాహు కాల సమయంలో సాంప్రదాయరీతిలో అర్చనలు ,అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా బంగారు నగలు, రంగు రంగు పూలతో అలంకరించి, భక్తులను దర్శనానికి అనుమతించారు. ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజరెడ్డి, ఈఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. భక్తుల సౌకర్యార్థం ఉచిత అన్నప్రసాద వితరణ చేశారు.

### చీరల వేలం.. ఆలయానికి ఆదాయం

**పలమనేరు:** పట్టణంలో శ్రీ తిరుపతి గంగమ్మ జాతరను పురస్కరించుకుని అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలను శుక్రవారం వేలం నిర్వహించారు. తద్వారా ఆలయానికి రూ.42,600 ఆదాయం సమకూరిందని ఆలయ ఈవో కమలాకర్ తెలిపారు. ఆలయ అధికారులు, పట్టణ పెద్దల సమక్షంలో వేలం నిర్వహించినట్టు చెప్పారు.

### రిజిస్ట్రేషన్ ప్రక్రియ పరిశీలన


రైతులకు విత్తనాలు అందజేస్తున్న ఏవో నర్మద

**శ్రీరంగరాజపురం:** మండలంలోని రైతుభరోసా కేంద్రాల్లో రాయితీ వేరుశనగ విత్తన కాయల పంపిణీకి సంబంధించిన పేర్ల నమోదు కార్యక్రమాన్ని ఏఓ నర్మద పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ప్రభుత్వం 40 శాతం రాయితీతో వేరుశనగ విత్తన కాయలు 30 కిలోల బస్తా రూ.1,710 ధరకు అందించనున్నట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు మాత్రమే వేరుశనగ కాయలు పంపిణీ చేస్తామన్నారు. అనంతరం తయ్యూరు రైతుభరోసా కేంద్రంలో రైతులకు వేరుశనగ విత్తనాలను అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జోత్స్న, అసిస్టెంట్ శివకుమార్, వీఆర్వో చంద్రబాబు, సచివాలయం సిబ్బంది ఉమ, ఉషా, జగదీష్, కుమార్, బిందుసాగర్ పాల్గొన్నారు.

### పౌర సరఫరాల గోదాము తనిఖీ


సరుకు నిల్వలను సరిచూస్తున్న ఆర్డీఓ

**నగరి:** పట్టణ పరిధిలోని పౌర సరఫరాల గోదామును ఆర్డీఓ వెంకటరెడ్డి తనిఖీ చేశారు. శుక్రవారం గోదాముకు సిబ్బందితోపాటు వెళ్లిన ఆయన ఆన్‌లైన్‌లో చూపుతున్న సరుకు నిల్వ, గోదాములో ఉన్న సరుకు నిల్వలను పరిశీలించారు. బియ్యం, పోర్టిఫైడ్ బియ్యం, కందిపప్పు, పామోలిన్, రాగి పిండి, గోధుమ పిండి, చక్కెర నిల్వలను విడివిడిగా లెక్కించి సరిచూశారు. సరుకుల నాణ్యతను ప్రత్యక్షంగా పరిశీలించారు. చూపుతున్న నిల్వల మేరకు గోదాములో సరుకు ఉన్నట్లు తేల్చారు. సరుకులను సరైన సమయాల్లో ఆయా దుకాణాలకు సరఫరా చేయాలని గోడౌన్ డీటీకి సూచించారు. ఈ తనిఖీలో డీఎస్ఓ శంకరయ్య, తహసీల్దార్ చంద్రశేఖర్, గోడౌన్ ఇన్‌చార్జి పి.ఆదం పాల్గొన్నారు.

## టపాసులు అమ్మితే కేసులు తప్పవు

- ఎన్నికల కోడ్ నిబంధనలు పాటించక తప్పదు
- మున్సిపల్ కమిషనర్ ఎన్‌వీ రమణారెడ్డి


పలమనేరు: దుకాణాల్లో తనిఖీలు చేస్తున్న మున్సిపల్ అధికారులు

**పలమనేరు:** ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పలమనేరులో ఎక్కడైనా టపాకాయలను విక్రయిస్తే కేసులు తప్పవని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని టపాకాయల దుకాణాలు, పెట్రోల్ బంకులు, అనధికారికంగా పెట్రోలు విక్రయించే దుకాణాలపై సచివాలయ, మున్సిపల్ సిబ్బందితో కలసి ఆయన ఆకస్మిక తనిఖీలు చేశారు. పలు పెట్రోల్ బంకుల్లో బాటిళ్లలో పెట్రోలు నింపుతున్న వారికి నోటీసులు జారీ చేశారు. టపాకాయలు విక్రయించే గోడౌన్ నిర్వాహకులు హెచ్చరికలు జారీ చేశారు. ఎన్నికల ఫలితాల నేపథ్యంలో టపాకాయలు కాల్చడం, విజయోత్సవ ర్యాలీలు, గుంపులుగా జనం ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్వో రవిరెడ్డి, టీపీఓ ఇందిర, సిబ్బంది పాల్గొన్నారు.

**బాణసంచా విక్రయిస్తే క్రిమినల్ కేసులు**

**చౌడేపల్లె:** ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో బాణాసంచా విక్రయించరాదని తహసీల్దార్ శివరాముడు అన్నారు. శుక్రవారం బాణాసంచా విక్రేతలు, పెట్రోల్ బంక్ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. బాటిళ్లలో పెట్రోల్ పట్టరాదని, పల్లెల్లో పెట్రోల్ విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున వచ్చే నెల 4న ఎన్నికల కౌంటింగ్ ఫలితాల అనంతరం బాణాసంచా పేల్చి సంబరాలు చేసుకోవడం, ర్యాలీ నిర్వహించడం చేయరాదన్నారు. నిబంధనలు ఉల్లంఘిగస్తే చర్యలు తప్పన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ సుధాకర్ నాయక్ పాల్గొన్నారు.

### చికిత్స పొందుతూ యువకుడి మృతి

**తవణంపల్లె:** ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడి శుక్రవారం మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ కథనం మేరకు, బంగారుపాళెం మండలం దుండువారిపల్లెకు చెందిన వాసుబాబు(15), హర్షవర్ధన్(15) ద్విచక్ర వాహనంపై అతివేగంగా వెళ్లి బోల్తాపడ్డారు. ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్రగాయాలయ్యాయి. వీరిని మెరుగైన వైద్యం కోసం వేలూరు సర్వీ ఆస్పత్రికి తరలించారు. హేమాద్రి కుమారుడు వాసుబాబు శుక్రవారం మృతి చెందారు. ఇదే ఘటనలో చికిత్స పొందుతున్న హర్షవర్ధన్ కోలుకొంటున్నట్లు తెలిపారు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### గంగమ్మకు అభిషేకం

**శ్రీ రంగరాజపురం:** మండలంలోని ఆరిమాకులపల్లెలో ఉన్న ఆరిమాను గంగమ్మకు ఘనంగా అభిషేకం చేశారు. వైఎస్సార్ సీపీ జీడీ నెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి గెలుపొందాలని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం కావాలని వెదురుకుప్పం మండలం బొమ్మయ్యపల్లె సర్పంచ్ చొక్కా గోవిందయ్య తన కుటుంబ సభ్యులతో కలిసి ఆరిమాని గంగమ్మకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. ఈ సందర్భంగా చొక్కా గోవిందయ్య మాట్లాడుతూ సంవృద్ధిగా వర్షాలు కురిసి రైతులందరూ సుభిక్షంగా ఉండాలంటే జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కటిక పల్లి సర్పంచ్ మార్కొండయ్య, శరత్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## పేదలందరికీ ఉచితంగా వైద్య సేవలు


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్

**తవణంపల్లె:** గ్రామ గ్రామానికి వెళ్లి పేదలందరికీ ఉచితంగా వైద్య సేవలందిస్తున్నట్లు డాక్టర్ వినయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని కట్టకిందపల్లెలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ వినయ్‌కుమార్ మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం పేదలకు వరం అన్నారు. ప్రజల దగ్గరకు వచ్చి సేవలందించే కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం ఉచిత వైద్యశిబిరంలో 37 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలిచ్చారు. బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులు, గర్భవతులు, బాలింతలకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. తవణంపల్లె పీహెచ్‌సీలోనే గర్భిణులకు ప్రసవం చేస్తున్నారని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రాజామణి, ఆరోగ్య కార్యకర్తలు సుబ్రమణ్యం రెడ్డి, నేత్రి, ఎంఎల్‌హెచ్‌పీ మౌనిక, డిఈఓ విజయలక్ష్మి, ఆశాకార్యకర్తలు వనజ, జమున, భారతి పాల్గొన్నారు.

## అశ్విన్ కుటుంబానికి డిప్యూటీ సీఎం పరామర్శ


మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

**శ్రీరంగరాజపురం:** సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అశ్విన్‌కుమార్ రెడ్డి కుటుంబ సభ్యులను డిప్యూటీ సీఎం నారాయణస్వామి శుక్రవారం పరామర్శించారు. ఎస్ఆర్ పురం మండలంలోని చొక్కమడుగు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు అశ్విన్‌కుమార్‌రెడ్డి (37) హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం పనిచేస్తున్నారు. అయితే కుటుంబ కలహాలతో అతడు హైదరాబాద్‌లో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతడి మృతదేహం స్వగ్రామానికి చేరుకోవడంతో సమాచారం అందుకున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి అక్కడికి వెళ్లారు. అశ్విన్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి, పార్టీ తరపున ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. అలాగే జెడ్పీటీసీ సభ్యులు రమణప్రసాద్‌రెడ్డి, మండల కన్వీనర్ మణి, సర్పంచ్ గిరిబాబు, ఎంపీటీసీ సభ్యుడు సిద్దయ్య, మాజీ సర్పంచ్ హరిప్రసాద్‌రెడ్డి, నాయకులు శీనయ్య, జనార్దన్, లోకనాథరాజు, కాళప్ప, బాబు, రాజా, అల్లిముత్తు తదితరులు అశ్విన్‌కు నివాళులర్పించారు.

## హంస వాహనంపై కల్యాణ రాముడి కటాక్షం

**బైరెడ్డిపల్లె:** మండలంలో బేలుపల్లె సమీపంలోని పట్నపల్లె కొండపై ఉన్న శ్రీ కల్యాణ వెంకట్రమణ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం హంస వాహనంపై స్వామి వారు విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు అనంతరం సాయంత్రం హంస వాహన సేవ నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకట్రమణస్వామి ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. ఆలయం చుట్టూ, గ్రామ వీధుల్లో ఊరేగించారు. భక్తులు మొక్కులు చెల్లించారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

## సెలవులు.. చెరువులు.. ప్రమాదాలు

- వర్షాలకు గుంతల్లోనూ చేరిన నీరు
- కైగల్ జలపాతంలో మృత్యులోయ
- కౌండిన్యలోనూ పలు ప్రమాదకర ప్రాంతాలు
- వేసవి వస్తే..ప్రాణాల మీదకు తెస్తున్న ఈత సరదా


చెరువు గుంతలోకి చేరిన వర్షపు నీటిలో పిల్లల జలకాలాట

**పలమనేరు:** విద్యార్థులకు వేసవి సెలవులొస్తున్నాయంటే తల్లిదండ్రులు ఒకింత ఆందోళన చెందాల్సి వస్తోంది. పిల్లల వినోదం, సరదా కాస్త విషాదంగా మారిన ఎన్నో సంఘటనలు గతంలో చోటుచేసుకున్నాయి. చెరువులు, కుంటలు, అడవుల్లోని గుంతలు ఏటా వేసవి సెలవుల్లో యువత, చిన్నారుల ప్రాణాలను హరిస్తున్నాయి. 4 రోజుల క్రితం వడమాలపేట మండలం ఎస్బీఆర్ పురంలో తల్లి ముందే ముగ్గురు అక్కాచెల్లెళ్లు దీపాలను చెరువులోకి వదిలేందుకు వెళ్లి నీట మునిగి మృతి చెందిన సంఘటన జిల్లా ప్రజలను కలచివేసింది. ప్రస్తుతం జిల్లాలో కురిసిన వర్షాలకు చెరువులు, గుంతలకు నీరు చేరింది. వేసవి సెలవుల్లో నీటిలో ఆడుకోవడం కోసం వెళ్లే పిల్లలు, యువకుల విషయంలో తల్లిదండ్రులు ఒకింత అప్రమత్తంగా ఉండవలసిన పరిస్థితులు నెలకొన్నాయి.

**ఏడేళ్లలో 34 మంది నీళ్లలో మునిగి మృతి**

ఏడేళ్ల కాలంలో పలమనేరు నియోజకవర్గంలో 25 మంది నీటిలో మునిగి మృతి చెందారు. గతంలో పట్టణానికి చెందిన కొందరు విద్యార్థులు చెరువులో ఈతకెళ్లగా ఓ యువకుడు మృతి చెందాడు. పట్టణానికి చెందిన ఓ బాలుడు కాలువపల్లె జలాశయంలో నీట మునిగి మృతి చెందాడు. ఇక గ్రామాల సమీపంలోని పలు చెరువుల్లో ఇటుకల కోసం లేదా ఇతర అవసరాల కోసం అక్రమార్కులు మట్టిని తోడేశారు. సంబంధిత చెరువు లేదా కుంటల లోతు, లోపలి పరిస్థితుల గురించి అవగాహన లేకుండా ఈదులాడేందుకు దిగి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఇక నీరు పుష్కలంగా ఉన్న చెరువుల కింది బావులు, అటవీ ప్రాంతానికి దగ్గరిలో ఉన్న బావులు, కట్టడపు రాయి బావులకు వెళ్లి ఈతరాని వారు ఎక్కువగా మృత్యువాత పడుతున్నారు. ఈత సరదా చివరకు ప్రాణాలను హరిస్తోంది. మరోవైపు యువత సెలవుల్లో సరదాగా గడిపేందుకు అడవిలోని కొత్త ప్రాంతాలకు వెళ్లడం, అక్కడున్న వాగుల్లో, చెరువుల్లో స్నానాలకు వెళ్లడం కూడా ప్రమాదాలకు కారణమవుతోంది. ఇక స్థానిక జలపాతాలైన కైగల్ దుముకురాళ్ల, కళ్యాణరేవులు, గంగన్న శిరస్సు, వైఎస్ఆర్ జలాశయాల వద్ద కూడా ఇదే పరిస్థితి. ముఖ్యంగా కైగల్ వాటర్‌ఫాల్స్‌లోని మృత్యులోయ ఇప్పటికే పలువురిని పొట్టనబెట్టుకుంది. ఇక్కడి సుడిగుండం కారణంగా నీటిలోకి దిగితే మళ్లీ పైకి రావడం అంత సులభమేమీ కాదు.


ఇటీవల వర్షాలకు చెరువులో చేరిన నీరు


పలమనేరు సమీపంలోని బావుల్లో ఈత కొడుతున్న పిల్లలు

### మితాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


రోగులను పరీక్షిస్తున్న డాక్టర్

**పుత్తూరు:** ప్రతి ఒక్కరూ మిత ఆహారం, క్రమం తప్పని వ్యాయామం చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునని టాటా ఆసుపత్రి డాక్టర్ వెంకయ్యబాబు సూచించారు. శుక్రవారం వడమాలపేట మండలం ఎస్బీఆర్‌పురం గ్రామంలో రాస్ సేవా సంస్థ, టాటా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. ప్రత్యేకించి మహిళలు తమ దైనందిన జీవితంలో ఏదో ఒక ఆరోగ్య సమస్యతో బాధ పడుతున్నారని తెలిపారు. మహిళలు క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ ప్రతి రోజూ విధిగా 45 నిమిషాలపాటు వ్యాయామం చేయాలని సూచించారు. సంవత్సరం నుంచి రాస్ సంస్థ ద్వారా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిబిరంలో 150 మందికి బీపీ, షుగర్, హెపటైటిస్, మహిళలకు గొంతు, రొమ్ము, గర్భాశయం పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్లు అమరావతి, రెడ్డికుమారి, మహేంద్ర వైద్య సేవలందించారు. కార్యక్రమంలో రాస్ ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం, రాస్ అధికారులు రవి, ప్రకాష్, మీనా, ప్రియ తదితరులు పాల్గొన్నారు.